
సాక్షి మహబూబ్‌నగర్

బుధవారం । 13 । మార్చి । 2024



తీగల వంతెనకు బ్రేక్

సోమశిల వద్ద కృష్ణానదిపై నిర్మించే తీగల వంతెన పనులకు బ్రేక్ పడింది.

వివరాలు 8లో ▸

ఇఫ్తార్ 6-33 (బుధవారం సాయంత్రం)

సహర్ 5-06 (గురువారం తెల్లవారుజామున)

రంజాన్ వేళలు

గరిష్ఠం/కనిష్ఠం 39.2 /19.7

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటూ అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

రాజకీయం.. రసవత్తరం!



ప్రతిష్టాత్మకంగా ఎమ్మెల్సీ ఉప ఎన్నిక

- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పోటాపోటీ ఎత్తుగడలు
- స్థానిక సంస్థల పరిధిలో 1,439 మంది ఓటర్లు
- 'కారు'కు సంఖ్యా బలం ఉన్నా.. 'హస్తం' వైపే మొగ్గు
- గెలుపుపై ఎవరి ధీమా వారిదే..

స్థానిక సంస్థల నియోజకవర్గ పరిధిలో ఓటర్లు..

ఎంపీలు	ఎమ్మెల్యేలు	ఎమ్మెల్సీలు
2	14	3
ఎంపీటీసీలు	జెడ్పీటీసీలు	కౌన్సిలర్లు
888	83	449

మొత్తం 1,439

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నికను ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నాయి. పాత సీటును నిలుపుకోవాలని కారు.. ఎలాగైనా గెలిచి తమ ఖాతాలో వేసుకోవాలని హస్తం తమ తమ ప్రయత్నాలను ముమ్మరం చేశాయి. ఇరు పార్టీలు పోటాపోటీ ఎత్తుగడలు, ప్రత్యేక వ్యూహాలను అమలు చేస్తుండడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రాజకీయాలు రసవత్తరంగా మారాయి. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం రెండు పర్యాయాలు బీఆర్‌ఎస్ అధికారంలోకి రాగా.. సుమారు పదేళ్ల పాటు పాలించింది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో అసెంబ్లీతో పాటు పంచాయతీ, మున్సిపాలిటీ, జిల్లా పరిషత్ ఇలా వరుస ఎన్నికల్లో ఆ పార్టీ హవా కొనసాగింది. అయితే ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమి పాలు కాగా.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈ క్రమంలో రాజకీయ పరిణామాలు ఒక్కసారిగా మారాయి. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా కావడంతో గెలుపే లక్ష్యంగా ఆ పార్టీ నేతలు ముందుకు సాగుతున్నారు.

కాంగ్రెస్ 12.. బీఆర్‌ఎస్ 2

ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 14 అసెంబ్లీ సెగ్మెంట్లలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్‌తో పాటు మరో 11 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. ఆయా నియోజకవర్గాల్లోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను తమ వైపునకు తిప్పుకునేలా ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు కృషి చేస్తున్నారు. అదే బీఆర్‌ఎస్‌కు ఇద్దరు ఎమ్మెల్యేలే ఉన్నారు. సంఖ్యాబలం ప్రకారం స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ఓటర్లలో ఎక్కువ శాతం బీఆర్‌ఎస్ సభ్యులే ఉన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత చాలా చోట్ల స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు చేయి అందుకున్నారు. మహబూబ్‌నగర్, కోస్గితో పాటు పలు మున్సిపల్ పీఠాలు కాంగ్రెస్ వశమయ్యాయి. మారిన రాజకీయ సమీకరణలతో కాంగ్రెస్‌లోకి స్థానిక ప్రజాప్రతినిధుల వలసలు జోరందుకున్నాయి. ఈ మేరకు ఊపు మీద ఉన్న కాంగ్రెస్.. తాజాగా మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానంలో గెలుపే లక్ష్యంగా వ్యూహాలు అమలు చేస్తోంది. నామినేషన్ల విత్‌డ్రా లోపు స్థానిక ప్రజాప్రతినిధులతో మాటముచ్చట్లు పూర్తి చేసి.. ఉపసంహరణ అనంతరం వారిని తరలించేలా ఇరు పార్టీలు ప్రత్యేక కార్యచరణతో ముందుకు సాగుతున్నట్లు సమాచారం.

బీఆర్‌ఎస్‌కు సంఖ్యా బలం ఉన్నా..

బీఆర్‌ఎస్‌కు చెందిన ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి గత డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌లో చేరి కల్వకుర్తి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత ఆయన రాజీనామాతో ఎమ్మెల్సీ ఉపఎన్నిక రాగా.. 16 మంది నామినేషన్లు దాఖలు చేశారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల పరిధిలోని మహబూబ్‌నగర్, నారాయణపేట, వికారాబాద్, రంగారెడ్డి నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లో మొత్తం 1,439 మంది ఓటర్లు ఉన్నారు. 2021లో బీఆర్‌ఎస్‌కు సంపూర్ణ మెజార్టీ ఉండగా.. అప్పుడు ఎమ్మెల్సీ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఆ సమయంలో బీఆర్‌ఎస్‌కు వెయ్యికి పైగా, కాంగ్రెస్‌కు 250, బీజేపీకి 110 వరకు బలం ఉంది. బీఆర్‌ఎస్‌కు సంఖ్యాబలం ఉంది. అయితే రాష్ట్రంలో మారిన రాజకీయ సమీకరణాల నేపథ్యంలో పాత సీటును గెలుచుకోవడం ఆ పార్టీకి అంత సులువు కాదనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

ఎవరి ధీమా వారిదే..

గెలుపుపై ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు గత పదేళ్లలో గౌరవం దక్కిందో లేదో అనే అంశం అందరికీ తెలుసని.. మూడు నెలల్లో సీఎం రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రంతోపాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని.. తన గెలుపు ఖాయమని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నె జీవన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేస్తున్నారు. బీఆర్‌ఎస్‌కు 900కుపైగా ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులు, కౌన్సిలర్ల బలం ఉందని.. ప్రలోభాలకు గురిచేసినా ఎవరూ లొంగరని.. తాను కచ్చితంగా గెలుస్తానని బీఆర్‌ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి అంటున్నారు. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల హక్కుల సాధనలో భాగంగా ఎమ్మెల్సీగా పోటీచేస్తున్నట్లు ఎంపీటీసీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడీల కుమార్‌గౌడ్ ప్రకటించారు. మన ఓట్లు మనమే వేసుకుందామనే ఉద్దేశంతో నామినేషన్ వేసినట్లు తెలిపారు. మొత్తంగా లోక్‌సభ ఎన్నికలకు ముందు జరుగుతున్న పోరు కావడం.. ఇరు పార్టీలు గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో రాజకీయాలు హీటెక్కాయి.

న్యూస్‌రీల్

ఆవిష్కరణలు అవసరం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పర్యావరణాన్ని ప్లాస్టిక్ నుంచి కాపాడంలంటే నూతన ఆవిష్కరణలు అవసరం అని రాష్ట్ర ప్రాజెక్టు అధికారి రాధిక అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పిల్లలమర్రి వద్ద ఉన్న సైన్స్ మ్యూజియంలో వేస్టు టూ వెల్త్ పేరిట నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్లాస్టిక్ వల్ల మానవాళికి ప్రమాదం పొంచి ఉందని, వాటి వల్ల అనేక ప్రాణులకు ముప్పు వాటిల్లుతుందన్నారు. విద్యార్థి దశ నుంచి ప్లాస్టిక్ నిర్మూలన కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. డీఈఓ రవీందర్ మాట్లాడుతూ విద్యార్థులకు పర్యావరణం పట్ల అవగాహన పెంచేందుకు ఎన్‌జీసీ వారు పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నారని వాటిని విద్యార్థులు అవగాహన చేసుకునేందుకు ప్రయత్నించాలన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో సైన్స్ అధికారి శ్రీనివాస్, సీఎంఓ బాలుయాదవ్, ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో ఉన్నత స్థానానికి ఎదగాలి



మహబూబ్‌నగర్ క్రీడలు: ఉమ్మడి జిల్లాకు చెందిన వాలీబాల్ క్రీడాకారిణి అనన్యశ్రీని పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ మంగళవారం అభినందించి సన్మానం చేశారు. వాలీబాల్‌లో అనన్యశ్రీ రాణిస్తుండడం సంతోషంగా ఉందని, భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. మక్తల్‌కు చెందిన అనన్యశ్రీ వాలీబాల్‌లో మెరుగైన ప్రతిభ చాటుతోంది. కేరళలో ఖేలో ఇండియా సెంటర్‌లో వాలీబాల్ శిక్షణ పొందుతూ అక్కడి రాష్ట్రస్థాయి, యూనివర్సిటీ జట్లకు ప్రాతినిధ్యం వహిస్తుంది. గత నెల 24 నుంచి 28 వరకు గౌహాటిలో జరిగిన ఖేలో ఇండియా యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనగా కేరళలోని ఎంజే యూనివర్సిటీ జట్టు రజత పతకం గెలుపొందింది. కార్యక్రమంలో అనన్యశ్రీ తల్లిదండ్రులు ఆనంద్‌కుమార్, వరలక్ష్మి, కోచ్ పర్వేజ్‌పాష పాల్గొన్నారు.

బైక్ మెకానిక్‌లో ఉచిత శిక్షణ

పాలమూరు: ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో పురుషులకు బైక్ మెకానిక్, హౌజ్ వైరింగ్‌లో నెలరోజులపాటు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు డైరెక్టర్ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన వారై ఉండి 18 నుంచి 35 ఏళ్లలోపు అభ్యర్థులు ఆధార్, రేషన్ కార్డు, పదో తరగతి మెమో తీసుకురావాలన్నారు. ఈ నెల 15లోగా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సదుపాయం ఉంటుందన్నారు.

ప్రతి కార్యకర్త హస్తం బ్యాడ్జీ ధరించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: రానున్న పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక ప్రచార దీక్ష కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి.. సీఎంకు హస్తం గుర్తు బ్యాడ్జీ పెట్టారు. మహబూబ్‌నగర్ ప్రచార దీక్షలో ప్రతి కార్యకర్త హస్తం గుర్తు బ్యాడ్జీ ధరించాలని సీఎం సూచించినట్లు వంశీచంద్‌రెడ్డి చెప్పారు.



ముగ్గురి నామినేషన్ల తిరస్కరణ

- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ బరిలో 13 మంది అభ్యర్థులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: స్థానిక సంస్థల నియోజకవర్గ శాసనమండలి ఉప ఎన్నికకు అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ల పరిశీలన ప్రక్రియ మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో ముగిసింది. 16 మంది అభ్యర్థులు 28 సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా.. రిటర్నింగ్ అధికారి, జిల్లా ఎన్నికల అధికారి రవినాయక్ ఎన్నికల కమిషన్ నియమించిన పరిశీలకురాలు అటవీ, పర్యావరణ, శాస్త్ర, సాంకేతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి ఎ.వాణిప్రసాద్ అభ్యర్థుల సమక్షంలో నామినేషన్ల స్క్రూటినీ నిర్వహించారు. ఇందులో 13 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదించగా.. మరో ముగ్గురు అభ్యర్థులవి తిరస్కరించారు. ఇందులో స్వతంత్ర అభ్యర్థులు శ్రీకాంత్ పిళ్లై, ఆర్.జీవన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అభ్యర్థి లక్ష్మీరెడ్డిలవి తిరస్కరణకు గురయ్యాయి.

■ తిరస్కరణ తర్వాత స్థానిక సంస్థల ఉప ఎన్నికల బరిలో 13 మంది ఉన్నారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ తరఫున మన్నె జీవన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నుంచి నవీన్‌కుమార్‌రెడ్డితో పాటు స్వతంత్ర అభ్యర్థులుగా కొండా సుధాకర్‌రెడ్డి, గడీల కుమార్‌గౌడ్, గవినోళ్ల బలరాంరెడ్డి, దేవి రవీందర్, మహమ్మద్ రహీం ఖాన్, మున్నూరు రవి, ముడావత్ శంకర్‌నాయక్, మంగి విజయ్, శరబ్బాయి కృష్ణ, సుదర్శన్‌గౌడ్, వి.సుమలత ఉన్నారు. అయితే ఈ నెల 14న ఉపసంహరణ తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తామని కలెక్టర్ వెల్లడించారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ పెట్టాలనే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి అన్నారు. మంగళవారం అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలను దొంగలుగా చిత్రీకరిస్తూ, అంగన్‌వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ పెట్టాలనే నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాలకు ఒకపూట బడితోపాటు మే నెల అంతా టీచర్స్‌కు, హెల్పర్స్‌కు సెలవులు ఇవ్వాలని, పనిచేయని సెల్‌ఫోన్లను తిరిగి వాపస్ తీసుకోవాలని, కొత్త 5జీ ట్యాబులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో 24 రోజుల సమ్మె సందర్భంగా జీతాలు చెల్లిస్తామని ఇచ్చిన హామీని అమలుచేయాలని, పాత పద్ధతిలోనే పదోన్నతులు కల్పించాలని, ప్రమోషన్ వయసు 50 ఏళ్లకు పెంచాలని, ఆన్‌లైన్ సమస్యల కారణంగా ఆగిపోయిన వేతనాలు, సెంటర్ అద్దె, గ్యాస్ బిల్లులు, ఆరోగ్యలక్ష్మి మెనూ చార్జీలు తదితర పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు. జీఓ నం.14 ,19, 8లను వెంటనే సవరించాలని డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టరేట్ ఏఓ శంకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సరోజ, ఉపాధ్యక్షురాలు ప్రభావతి, రాజ్యలక్ష్మి, గౌసియాబేగం, పద్మ, కవిత, కమల, సీఐటీయూ పట్టణ కన్వీనర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ హ్యాండ్‌బాల్ జట్టు కెప్టెన్‌గా గిరిజన విద్యార్థిని



పాత్లావత్ రోజ

జడ్చర్ల: మారుమూల గిరిజన తండాకు చెందిన ఓ విద్యార్థిని తెలంగాణ రాష్ట్ర హ్యాండ్‌బాల్ జట్టు కెప్టెన్‌గా ఎంపికైంది. మండలంలోని కోడ్గల్ పంచాయతీ పరిధిలోని మక్తపల్లికి చెందిన పాత్లావత్ రోజ జడ్చర్లలోని బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ క్రమంలో తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల కరీంనగర్ జిల్లాలో జరిగిన హ్యాండ్‌బాల్ సీనియర్ ఉమెన్ చాంపియన్ షిప్‌లో ఉమ్మడి పాలమూరు జిల్లా జట్టుకు రోజ ప్రాతినిధ్యం వహించి ఉత్తమ ప్రతిభకనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. హ్యాండ్‌బాల్‌లో రోజ అత్యుత్తమ ప్రతిభను గుర్తించిన రాష్ట్ర నిర్వాహకులు తెలంగాణ హ్యాండ్‌బాల్ మహిళల జట్టుకు సారథ్యం వహించే అవకాశం కల్పించారు. దీంతో ఆమె ఈ నెల 16 నుంచి 20 వరకు కేంద్ర పాలిత ప్రాంతం దాద్ర నగర్ హవేళిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు కెప్టెన్‌గా వ్యవహరించనుంది. రాష్ట్ర జట్టు కెప్టెన్‌గా గిరిజన బిడ్డ ఎంపికవడం పట్ల జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శంకర్ నాయక్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

16న ప్రధాని మోదీ రాక

- నాగర్‌కర్నూల్‌లో ఎన్నికలశంఖారావం సభ
- ఏర్పాట్లు పరిశీలించిన పార్టీ నాయకులు



కందనూలు: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ నెల 16న నాగర్‌కర్నూల్‌కు వస్తున్నారని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి అన్నారు. ఈ క్రమంలో లక్ష మందితో నిర్వహించే ఎన్నికల శంఖారావం బహిరంగ సభకు జిల్లాకేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తాలో అనువైన స్థలాన్ని మంగళవారం డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్, వనపర్తి జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు, రాష్ట్ర కార్యదర్శి దిలీప్‌ఆచారితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆచారి మాట్లాడుతూ బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌కు మద్దతుగా ప్రధాని మోదీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని చెప్పారు. ప్రధాని హోదాలో తొలిసారిగా నాగర్‌కర్నూల్‌కు వస్తున్న నరేంద్రమోదీకి పెద్దఎత్తున స్వాగతం పలకడంతోపాటు, బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే కల్వకుర్తి నుంచి నంద్యాల హైవే నిర్మాణంలో భాగంగా ఐకానిక్ బ్రిడ్జి మంజూరు చేసిన మోదీకి ధన్యవాద కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పార్లమెంట్ నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ రఘునందన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు



వీసీలో పాల్గొన్న రవినాయక్, అదనపు కలెక్టర్లు తదితరులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: రానున్న పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు కలెక్టర్లు అన్ని ఏర్పాట్లతో సంసిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. మంగళవారం ఆయన హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై వీసీ నిర్వహించారు. ఓటరు జాబితాపై వచ్చిన అన్ని ఫిర్యాదులను విచారణ జరిపి ఎలాంటి తప్పులు లేకుండా జాబితా రూపొందించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ముద్రణకు ప్రింటింగ్ ప్రెస్‌ను ముందే గుర్తించాలని, హోం ఓటింగ్ ప్రక్రియ సక్రమ నిర్వహణకు సరైన ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చెప్పారు. పోలింగ్ రోజు రికార్డింగ్ కోసం సరైన వెబ్ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా అవసరమైన వీడియో సర్వేలైన్స్, వీడియో వీక్షణ తదితర పనుల కోసం అవసరమైన కెమెరాలను సిద్ధం చేసుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వ్యతిరేక వార్తలకు ఎప్పటికప్పుడు స్పందించి ఎన్నికల సంఘానికి పంపించే బాధ్యతను కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మోడల్ పోలింగ్ కేంద్రాలను బాగా తీర్చిదిద్దారని, అలాగే పార్లమెంట్ ఎన్నికల్లో సైతం ఏర్పాటు చేయాలన్నారు. ఆర్‌ఓతోపాటు జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో కమ్యూనికేషన్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన సమాచారాన్ని బుధవారంలోగా పంపించాలని, ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది డేటా అప్‌డేషన్‌పై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. అదనపు సీఈఓ లోకేష్, సర్ఫరాజ్ అహ్మద్ మాట్లాడుతూ ఓటరు జాబితా, పోస్టల్ బ్యాలెట్, పోలింగ్ స్టేషన్లో మౌలిక సదుపాయాలు, నోడల్ టీంలకు ఇచ్చే శిక్షణ, ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత ప్రతిరోజు సమర్పించే నివేదికలు, అనుమతులు, ఫిర్యాదుల పరిష్కారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, సెక్టోరల్ అధికారుల నియామకం, హోం ఓటింగ్, నామినేషన్ల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలను క్షుణ్ణంగా వివరించారు. సమావేశంలో కలెక్టర్ రవినాయక్, అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు, డీఆర్‌ఓ రవికుమార్ పాల్గొన్నారు.

పాలమూరులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్



టాస్క్ సీఈఓతో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్, నాలెడ్జ్ (టాస్క్) సంస్థ ఆధ్వర్యంలో రెండు, మూడు వారాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు ఐటీశాఖ మంత్రి అనుమతి ఇచ్చినట్లు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ మాసబ్ ట్యాంక్‌లోని టాస్క్ కార్యాలయంలో మంగళవారం సీఈఓ శ్రీకాంత్ జిల్లాకేంద్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు గురించి చర్చించారు. ఉమ్మడి జిల్లాలో ఐటీఐ ఒకేషనల్ ఇంటర్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు, వేలాది మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా, స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇప్పించి వారి నైపుణ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయాలనే ఉద్దేశంతో టాస్క్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అనతి కాలంలోనే ఈ సెంటర్‌ను స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీగా రూపాంతరం చేయడానికి కృషిచేస్తామన్నారు. జిల్లాకేంద్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ బిల్డింగ్ నిర్మాణానికి అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ ద్వారా రూ.20 కోట్లను ఆర్ అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంజూరు చేసినట్లు వివరించారు. పాలమూరును స్కిల్ డెవలప్‌మెంట్ హబ్‌గా మార్చేందుకు కృషి చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, సెంటర్ ఏర్పాటుకు అనుమతి ఇచ్చిన మంత్రి శ్రీధర్‌బాబు, టాస్క్ సీఈఓకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

నీటి వనరులు ఉంటేనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ నర్సింహులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఎక్కడైతే నీటి వనరులు విరివిగా ఉంటాయో అక్కడ అభివృద్ధి జరుగుతుందని డీఆర్‌డీఓ నర్సింహులు అన్నారు. కేంద్ర జలశక్తి అభియాన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా మహిళా సమాఖ్య భవనంలో భూగర్భ జల బోర్డు, జలశక్తి మిషన్‌లో భాగంగా ప్రజలతో చర్చాగోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీళ్లు ఉన్న చోట పచ్చదనం ఉంటుందని, వాతావరణంలో కాలుష్యం, ఉష్ణోగ్రత పెరిగిపోవడం వల్ల పచ్చదనం కనుమరుగవుతుందన్నారు. నీళ్లున్న చోట నాగరికత ఉంటుందని.. నాగరికత ఉంటే మనిషి అభివృద్ధి చెందుతారన్నారు. జిల్లాలో వర్షపాతం చాలా తక్కువగా ఉంటుందని, దీంతో నీటి వనరులు చాలా తక్కువగా ఉంటాయన్నారు. నీళ్లను పొదుపుగా వాడుకోవడం నేర్చుకోవాలని, చిన్నప్పటి నుంచి నీళ్లపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రాన్రాను భూగర్భ జలాలు పూర్తిగా పడిపోతున్నాయని, భవిష్యత్ తరాలకు నీళ్ల చుక్క దొరకడం కష్టంగా మారిందన్నారు. నీళ్లను ఎంత పొదుపుగా వాడుకుంటే అంత మంచిది అన్నారు. గ్రామాల్లో నీళ్ల నిల్వ కోసం చెక్‌డ్యాంలు, పాంపాండ్లు ఈజీఎస్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని గండీడ్, హన్వాడ వాటర్‌షెడ్ మండలాలుగా గుర్తింపు పొందాయన్నారు. అనంతరం కేంద్రీయ భూగర్భ జల బోర్డు రీజినల్ డైరెక్టర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ జలం జీవనాధారమని అలాంటి జల వనరులను పొదుపుగా వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రాణి, సుధీర్‌కుమార్, వెంకటగిరి, డీఆర్‌డీఓ ప్లాంటేషన్ అధికారి సుష్మ, శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ వ్యవస్థతో ప్రజలకు రక్షణ



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

మహబూబ్‌నగర్ క్రైం: ఎస్పీ హర్షవర్ధన్ ఆదేశాల మేరకు టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఏర్పాటు చేసిన ఫ్లాగ్ మార్చ్‌ను ఏఆర్ ఏఎస్పీ సురేష్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు ఎక్కడ విఘాతం కలిగిన ప్రజలలో భరోసా.. ధైర్యం కల్పించడమే లక్ష్యంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తామన్నారు. పోలీస్ వ్యవస్థ ప్రజలకు రక్షణ కల్పించడం, శాంతియుత వాతావరణం కల్పించడం కోసం విధులు నిర్వహిస్తారని చెప్పారు. ఫ్లాగ్ మార్చ్ తెలంగాణ చౌరస్తా నుంచి బస్టాండ్, మల్లికార్జున చౌరస్తా, న్యూటౌన్, జనరల్ ఆస్పత్రి మీదుగా మెట్టుగడ్డ వరకు కొనసాగింది. కార్యక్రమంలో టూటౌన్ సీఐ డి.స్వామిగౌడ్, ఎస్‌ఐ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ గారూ.. వేదన వినరా?



'అయ్యా.. నా కొడుకు పేరు వెంకటాచారి.. నా భర్త పోయాక ప్రభుత్వం ఇచ్చే పింఛన్ డబ్బులతో నిత్యావసర సరుకులు తెచ్చుకొని వేరుగా వండుకు తింటున్నా.. నా భర్త కట్టిన ఇంట్లోనే కుమారుడు ఉంటున్నాడు.. కూడు పెట్టకపోవడమేగాక ఇంట్లో ఉండొద్దని కొడుకు, కోడలు ఇబ్బందులు పెడుతున్నారు.. నాకు ఏదైనా దారి చూపండి' అని కలెక్టర్‌ను వేడుకునేందుకు మంగళవారం బాలానగర్‌కు చెందిన దార్ల అలివేలమ్మ కలెక్టరేట్‌కు వచ్చింది. కలెక్టర్‌ను కలవాలని.. ఎవరైనా సాయం చేయాలంటూ అటుగా వచ్చిపోయే వారిని ప్రాధేయపడటం కనిపించింది. కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులు శాసనమండలి ఉపఎన్నిక నామినేషన్ల స్క్రూటినీలో బిజీగా ఉండడంతో ఆ వృద్ధురాలు సాయంత్రం వరకు అక్కడే పడిగాపులు పడటం కనిపించింది.

– మహబూబ్‌నగర్ న్యూటౌన్

క్లుప్తంగా

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

బల్మూర్: చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందిన ఘటన మంగళవారం మండలంలోని బిల్లకల్‌లో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన గూడూరు వెంకటయ్య (50) సోమవారం రాత్రి చేపల వేటకు గ్రామ సమీపంలోని ఎర్రకుంటకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెరువులో పడి వలకు చిక్కుకొని మృతిచెందాడు. మంగళవారం అటుగా వెళ్లిన గ్రామస్తులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. వెంకటయ్య భార్య అనారోగ్యంతో మూడు నెలల క్రితమే మృతిచెందింది. సంతానం లేకపోవడంతో గ్రామంలోనే ఉన్న తన చెల్లెలు లక్ష్మమ్మ వద్ద ఉండేవాడు. లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్‌ఐ బాలరాజు తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి బలవన్మరణం


సలేశ్వరంగౌడ్ (ఫైల్)

వెల్దండ: వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వెల్దండ మండలం ఎర్రవల్లిలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. ఎర్రవల్లికి చెందిన అల్వాల సలేశ్వరంగౌడ్ (35) చారకొండలో కిరాణ షాప్ నిర్వహించడంతో పాటు మెకానిక్ పనిచేస్తూ, జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం స్వగ్రామమైన ఎర్రవల్లికి వచ్చిన అతడు.. వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రవి ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య రేణుకతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. అతడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉరేసుకుని గొర్రెల కాపరి..

వేములపల్లి(మిర్యాలగూడ): ఉరేసుకుని ఓ గొర్రెల కాపరి మృతి చెందాడు. నల్లగొండ జిల్లా వేములపల్లి మండలకేంద్రం శివారులో మంగళవారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం అజలాపురం గ్రామానికి చెందిన కాకుంట్ల మహేష్ (22) గొర్రెల కాపరిగా జీవనం సాగిస్తున్నాడు. మహేష్ నెల రోజుల క్రితం కొంతమంది కాపరులతో కలిసి జిల్లాలోని ఆయా గ్రామాల్లో గొర్రెలను మేపుకుంటూ వస్తున్నాడు. ఈ నెల 7వ తేదీన మరో కాపరి భాస్కర్‌తో కలిసి వేములపల్లి మండలంలోకి ప్రవేశించారు. సోమవారం రాత్రి మండలకేంద్రం శివారులో ఇద్దరూ భోజనం చేసి పడుకున్నారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు భాస్కర్ నిద్ర లేచేసరికి మహేష్ కనిపించలేదు. సమీపంలోని చెట్టుకు ఉరేసుకుని విగతజీవుడిగా కనిపించాడు. వెంటనే విషయాన్ని ఫోన్‌లో కుటుంబ సభ్యులు, పోలీసులకు తెలిపాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మహేష్ ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. మిర్యాలగూడ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడు మహేష్ అవివాహితుడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతుడి బాబాయ్ కాకుంట్ల శ్రీశైలం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

మృతదేహం లభ్యం

మదనాపురం: మదనాపురం మండలంలోని కొన్నూరు గ్రామ శివారు, మంగళవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గ్రామస్తులు గుర్తించారు. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ శేఖర్‌రెడ్డితో పాటు సిబ్బంది అక్కడి చేరుకున్నారు. చనిపోయిన వ్యక్తి (55) తెలుపు రంగు అంగీ, నీలం రంగు లుంగీ ధరించాడు. ఆ వ్యక్తిని ఎవరైనా గుర్తిస్తే మదనాపురం పోలీసులను సంప్రదించాలని ఎస్‌ఐ తెలిపారు. వివరాలకు 8712670633 ఫోన్ చేయాలని కోరారు.

యువకుడి అంత్యక్రియలు పూర్తి

గండేడ్: మండలంలోని పగిడ్యాల్‌లో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన రామాంజనేయులు (18) అంత్యక్రియలు పూర్తయ్యాయి. యువకుడి ఆత్మహత్యకు అదే గ్రామానికి చెందిన బోరుబండి యజమాని కృష్ణారెడ్డి, అతడి తమ్ముడు మన్యపురెడ్డి కారణమని పేర్కొంటూ మృతుడి కటుంబ సభ్యులు మృతదేహంతో ఆందోళన చేపట్టిన విషయం విధితమే. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని మహబూబ్‌నగర్ రూరల్ సీఐ గాంధీనాయక్, స్వామి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మంగళవారం సాయంత్రం వ్యవసాయ పొలంలో రామాంజనేయులు అంత్యక్రియలు నిర్వహించారు.

కొనసాగుతున్న పోలీస్ పికెటింగ్..

యువకుడి ఆత్మహత్యతో పగిడ్యాల్‌లో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఈక్రమంలో డీఎస్పీ, ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్‌ఐలతో పాటు కోయిల్‌కొండ, మహమ్మదాబాద్, హన్వాడ పోలీసు సిబ్బంది, స్పెషల్ ఫోర్స్ పోలీసులు గ్రామానికి చేరుకుని, పరిస్థితిని చక్కదిద్దారు. మంగళవారం కూడా పోలీస్ పికెటింగ్ కొనసాగింది. మహమ్మదాబాద్ ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

తీగల వంతెనకు బ్రేక్


ఐకానిక్ బ్రిడ్జి నమూనా

నిధుల సర్దుబాటు సమస్యతో నిలిపివేసిన కేంద్రం

- కృష్ణానదిపై 4 లేన్ల ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మించాలని గతేడాది నిర్ణయం
- వంతెన పూర్తయితేనే అందుబాటులోకి రానున్న 167కే జాతీయ రహదారి


వంతెన నిర్మించే సోమశిల-సిద్ధేశ్వరం కొండలు

అచ్చంపేట: రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నిర్మించ తలపెట్టిన 167కే జాతీయ రహదారిలో భాగంగా సోమశిల-సిద్ధేశ్వరం మధ్య కృష్ణానదిపై రూ.1,100 కోట్లతో ఐకానిక్ వంతెన, బ్రిడ్జికి అనుసంధానంగా రూ.442 కోట్లతో 13.4 కిలోమీటర్ల రోడ్డు పనులను కేంద్ర రవాణ, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ ప్రస్తుతానికి నిలిపివేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నిధుల సర్దుబాటు సమస్య కారణంగా వీటిని తాత్కాలికంగా పక్కన పెట్టినట్లు రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వ అధికారులు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. ఇప్పటికే ఈ రెండు పనులకు సంబంధించి అలైన్‌మెంట్, డీపీఆర్ ఆమోదం పొంది టెండర్లు కూడా పిలిచారు. టెండర్లు ఖరారు కావాల్సిన చివరి దశలో నిలిపివేయాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. వచ్చే ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో నిధులు కేటాయించే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. 2022, అక్టోబర్ 7న కేంద్ర జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ పరిధిలోని స్టాండింగ్ ఫైనాన్స్ కమిటీ(ఎస్‌ఎఫ్‌సీ) వంతెన నిర్మాణానికి ఆమోదం తెలిపింది. దేశంలోనే తొలిసారి రెండు అంతస్తుల కేబుల్ వంతెన ఇక్కడ నిర్మించేందుకు కేంద్రం సిద్ధమైంది. బ్రిడ్జి పైభాగంలో వాహనాలు వెళ్లడంతో పాటు దిగువన పర్యాటకులు నడుచుకుంటూ సోమశిల ప్రకృతి అందాలు, నది పరవళ్లు తిలకించేందుకు వీలుగా గాజు వంతెన (పెడస్ట్రియన్ డెక్) నిర్మాణం నిలిపివేయడం పలు అనుమానాలకు తావిస్తోంది.

టెండర్ దశలో ఉంది..

తీగల వంతెన నిర్మాణానికి కేంద్రం టెండర్ కూడా పిలిచింది. భారత్‌మాల పరియోజన పథకం కింద నిధులు కేటాయించాలని నిర్ణయించింది. దీంతో టెండర్ ప్రాసెస్ కొంత ఆలస్యం అవుతుంది. మొదటి ఫేజ్‌లో రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కల్వకుర్తి-నాగర్‌కర్నూల్, నాగర్‌కర్నూలు-కొల్లాపూర్ మధ్య పనులు జరుగుతున్నాయి. బైపాస్, అండర్‌పాస్ పనులు మొదలు కావాల్సి ఉంది. భూసేకరణ పూర్తయితే పనులు ప్రారంభమవుతాయి.

– రాజేందర్, ఈఈ, జాతీయ రహదారుల అధికారి

ప్రారంభం కాని బైపాస్, అండర్‌పాస్‌లు..

జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా చేపట్టే బైపాస్ రోడ్ల పనులు నేటికీ ప్రారంభం కాలేదు. 7 మేజర్, 24 మైనర్ జంక్షన్లతో పాటు 4 అండర్‌పాస్‌ల నిర్మాణాలు మొదలు కావాల్సి ఉంది. కల్వకుర్తి, తాడూరు, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ బైపాస్ రోడ్డు నిర్మాణానికి 362 ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా.. ప్రభుత్వం భూ సేకరణ డ్రాఫ్ట్ నోటిఫికేషన్, అవార్డ్ ప్రకటించాల్సి ఉంది. కల్వకుర్తిలో 10.20 కి.మీ. బైపాస్‌కు 106.95 ఎకరాలు, తాడూరులో 63.15 ఎకరాలు, నాగర్‌కర్నూల్‌లో 12.60 కి.మీ.లకు 76.95 ఎకరాలు, పెద్దకొత్తపల్లిలో 39.76 ఎకరాలు, తెలకపల్లిలో 0.51 ఎకరాలు, కొల్లాపూర్‌లో 3.50 కి.మీ.లకు 49.73 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది.

ముమ్మరంగా రహదారి పనులు..

కల్వకుర్తి-నంద్యాల జాతీయ రహదారి 167కె పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మొదటి ప్యాకేజీ కింద జిల్లాలోని కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, పెద్దకొత్తపల్లి, కొల్లాపూర్ వరకు ఉన్న 79.300 కిలోమీటర్ల రోడ్డును జాతీయ రహదారిగా మారుస్తున్నారు. రూ.629.96 కోట్లతో చేపట్టే ఈ రహదారి పనులకు 2021, సెప్టెంబరు 26న టెండర్ పిలువగా రూ.436.91 కోట్లకు ఆర్‌కే ఇన్‌ఫ్రా దక్కించుకుంది. పట్టణాలు, గ్రామాల్లో 15 మీటర్ల నాలుగు వరుసల రహదారి, డివైడర్, భూగర్భ డ్రెయినేజీ నిర్మాణం, సాధారణ చోట్ల 10 మీటర్ల రెండు వరుసల పేవ్ షోల్డర్స్ రహదారి నిర్మాణం చేపడుతున్నారు. 100 కిలోమీటర్ల వేగంతో వాహనాలు వెళ్లగలిగేలా బీటీ రహదారి పనులు కొనసాగుతున్నాయి. గతేడాది జూలైలో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. మొదటి ప్యాకేజీలోని కల్వకుర్తి-నాగర్‌కర్నూల్ మధ్య సుమారు 70 శాతం పనులు పూర్తి కాగా.. నాగర్‌కర్నూల్- కొల్లాపూర్ మధ్య దాదాపు సగం పనులు చేశారు. ఈ మార్గంలో 3 వంతెనలు, 33 వరకు కల్వర్టులు నిర్మించాల్సి ఉండగా ఆయా పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మరో ఆరునెలల్లో పనులు పూర్తిచేసి అందుబాటులోకి తెచ్చేందుకు జాతీయ రహదారుల అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

వంతెన నిర్మాణంతోనే ప్రయోజనం..

ఐకానిక్ బ్రిడ్జి, అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపడితేనే నంద్యాల వరకు వాహనాలు ప్రయాణం చేసే అవకాశం ఉంటుంది. ఈ పనులు మొదలుకాకపోతే మొదటి ప్యాకేజీ కింద చేపట్టిన రోడ్డుతో ఎలాంటి ప్రయోజనం ఉండదని వాహనదారులు అభిప్రాయపడుతున్నారు. సోమశిల, సిద్ధేశ్వరం, సంగమేశ్వర ఆలయాలు ఈ మార్గంలోనే ఉన్నాయి. కృష్ణానదిపై తీగల వంతెన ఏర్పాటుతో జిల్లాకు కొత్తశోభ సంతరించుకుంటుందనే దశలో పనులకు బ్రేక్ పడటం అందరిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. హైవే నిర్మాణం పూర్తయితే తక్కువ సమయంలో హైదరాబాద్-తిరుపతి రాకపోకలను సాగించవచ్చు.

చున్నీనే యమపాశమైంది!

- బైక్‌పై వెళ్తుండగా చున్నీ వెనుక చక్రాలకు చుట్టుకోవడంతో కిందపడిన భార్యాభర్తలు
- చికిత్స పొందుతూ భార్య మృతి
- 5 నిమిషాల్లో ఇంటికి చేరుకుంటామనగా ఘటన


గౌతమి (ఫైల్)

మదనాపురం: భార్యాభర్తలు ఇద్దరూ కలిసి బైక్‌పై ఇంటికి బయలుదేరగా మెడలో వేసుకున్న చున్నీ వాహనం టైరులో ఇరుక్కుని ఓ వివాహిత అకాల మృతిచెందింది. ఈ విషాదకర సంఘటన వనపర్తి జిల్లా మదనాపురం మండలంలోని గోవిందహళ్లి వద్ద చోటుచేసుకుంది. ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి కథనం ప్రకారం.. కొత్తకోట వీవర్స్‌కాలనీకి చెందిన యాదగిరికి చిన్నచింతకుంటకు చెందిన గౌతమి(19)తో తొమ్మిది నెలల క్రితం వివాహమైంది. ఈ క్రమంలో గౌతమి తల్లిగారింటి నుంచి సోమవారం రాత్రి భర్తతో కలిసి కొత్తకోటకు బైక్‌పై బయలుదేరారు. 5 నిమిషాల్లో ఇంటికి చేరుకుంటామనగా.. అర కిలోమీటరు దూరంలో గోవిందహళ్లి మైసమ్మ ఆలయం వద్ద గౌతమి మెడలో ఉన్న చున్నీ ప్రమాదవశాత్తు బైక్ వెనక చక్రానికి చుట్టుకొని భార్యాభర్తలు ఇద్దరూ కిందపడ్డారు. దీంతో గౌతమి తలకు తీవ్రగాయాలు కావడంతో వెంటనే హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మంగళవారం ఉదయం మృతిచెందింది. ఈ ఘటనపై గౌతమి తండ్రి వెంకటన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామని చెప్పారు.

అనాథను 'ఆధార్' ఇప్పించండి



మహబూబ్‌నగర్ న్యూటౌన్: 'మా అమ్మను తొమ్మిదేళ్ల క్రితం మా నాన్న వదిలేశాడు. మా అమ్మ అనారోగ్యంతో రెండు సంవత్సరాల క్రితం చనిపోయింది. ఇప్పుడు నాకు 17 సంవత్సరాలు, ఆధార్ తీసుకోలేదు. ప్రస్తుతం బంధువుల వద్ద ఉంటున్నాను. నాకు ఆధార్ కార్డు ఇప్పించండి' అంటూ హన్వాడ మండలం ఇబ్రహీంబాద్‌కు చెందిన అనాథ బాలుడు మల్లేష్ ఓఎంఐఎఫ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో కలెక్టర్‌ను కలిసేందుకు మంగళవారం కలెక్టరేట్‌కు వచ్చారు. శాసన మండలి ఉపఎన్నిక నామినేషన్ల స్క్రూటీని కార్యక్రమంలో కలెక్టర్ బిజీగా ఉండడంతో వెనుతిరిగి వెళ్లిపోయాడు. గతంలో పలుమార్లు ప్రజావాణిలో జిల్లా అధికారులను కలిసి విన్నవించినట్లు స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ రాములు పేర్కొన్నారు.

వైద్యుడి అవతారమెత్తిన సెక్యూరిటీ గార్డు


క్షతగాత్రురాలికి కుట్లు వేస్తున్న సెక్యూరిటీ గార్డు

కందనూలు: జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఓ సెక్యూరిటీ గార్డు వైద్యుడి అవతారమెత్తాడు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు సెక్యూరిటీ గార్డు వైద్యసేవలు అందించడం అందరినీ విస్మయానికి గురిచేసింది. వివరాల్లోకి వెళ్తే.. బిజినేపల్లి మండలం ఖానాపూర్‌కు చెందిన ఐదుగురు ఆటోలో కుమ్మెర గట్టు మల్లయ్య బ్రహ్మోత్సవాలకు వెళ్తుండగా. కుమ్మెర సమీపంలో కారు ఢీకొట్టింది. ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తో పాటు ఐదుగురికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వైద్యులు ఉన్నప్పటికీ.. ఓ సెక్యూరిటీ గార్డు తెలిసీ తెలియని వైద్యం అందించడం పలువురిని ఆశ్చర్యానికి గురిచేసింది. వైద్యుడు నిర్వహించాల్సిన పనులను సెక్యూరిటీ గార్డుతో చేయించడంపై బాధిత కుటుంబాల వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏదైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. జనరల్ ఆస్పత్రిలో క్షతగాత్రులను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వాపోయారు. విధి నిర్వహణలో అలసత్వం వహించిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సమసమాజ స్థాపనకు సంఘటితమవుదాం


సమావేశంలో మాట్లాడుతున్న వడ్డే విజయ సారథి

స్టేషన్ మహబూబ్‌నగర్: కులమనేటటువంటి వ్యవస్థను కడప వరకే పరిమితం చేసి గడపదాటి బయటకు వస్తే సమానమేనని, అంతా హిందువులమనే భావన కలిగేటట్లు నడుచుకోవాలని, వివిధ వర్గాల మధ్య భేదాలను తొలగించడం, సమ సమాజ స్థాపన కోసం అందరం సంఘటితమవుదామని ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ ప్రాంత సద్భావన సభ్యులు టోలి వడ్డే విజయ సారథి అన్నారు. జిల్లా కేంద్రంలోని కన్వెన్షన్ హాల్లో మంగళవారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో సద్భావన సమావేశం నిర్వహించారు. ప్రధాన వక్తగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ హిందూ సమాజంలో అనేక కులవృత్తులవారు, వివిధ సామాజిక వర్గాలు వారు వారి జీవనోపాధి కొనసాగిస్తూ జీవిస్తున్నట్లు తెలిపారు. అందరిని ఒకే తాటిపై తీసుకొచ్చి అంతా సమానమైన భావన కల్పించడానికి సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ విభాగ్ సంఘచాలక్ ఏమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సంఘచాలక్ వసంతం వెంకటేశ్, విభాగ్ ప్రచారక్ దేవేందర్‌జీ, జిల్లా కార్యవాహ కురుమయ్య పాల్గొన్నారు.

అప్పాయపల్లిలో బాంబ్‌స్క్వాడ్ బృందం


అప్పాయపల్లిలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

లింగాల: మండలంలోని అప్పాయపల్లిలో సోమవారం జిలెటిన్ స్టిక్స్ పేలి ధనుష్ అనే బాలుడు గాయపడి త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడిన విషయం పాఠకులకు విధితమే. ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం సీఐ రవీందర్, ఎస్‌ఐ జగన్‌మోహన్ బాంబ్‌స్క్వాడ్ బృందంతో గ్రామంలోని ఎస్సీకాలనీలోని పలు ఇళ్లు, ఇతర ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించారు. రాళ్లను పగులగొట్టే జిలెటిన్ స్టిక్స్ రోడ్డుపై ఎలా పడ్డాయి.. వీటిని ఎవరు వినియోగిస్తున్నారనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. బాలుడు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో రెండోతరగతి చదువుతున్నారని.. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఇంటికి వెళ్తుండగా ఒక కాయిల్ రెండు వైర్లున్న వస్తువు రోడ్డుపై దొరికిందని వివరించారు. ఇంటికెళ్లి స్విచ్ బోర్డులో పెట్టగా పేలిందని ఎస్‌ఐ తెలిపారు. బాలుడి తండ్రి సవారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు చెప్పారు.

తగ్గుతున్న నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో రోజురోజుకు నీటిమట్టం తగ్గుతోంది. మంగళవారం 1,014 అడుగులకు చేరినట్లు ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు. జూరాల ఎడమ, సమాంతర కాల్వల ద్వారా ప్రాజెక్టుకు నీటి సరఫరా నిలిపివేశారని.. ప్రస్తుతం తాగునీటి అవసరాలకు జలాశయంలోని 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ వివరించారు.

వేతనాలు ఇవ్వడం లేదంటూ ఎన్‌హెచ్‌ఆర్‌సీలో ఫిర్యాదు

సాక్షి, న్యూఢిల్లీ: కాంట్రాక్టర్ రెండేళ్లుగా వేతనాలు ఇవ్వడం లేదంటూ నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్‌కు నలుగురు కార్మికులు ఫిర్యాదు చేశారు. వనపర్తి గ్రామానికి చెందిన గంధం బాలరాజు, గంధం గట్టయ్య, నర్సింహ, పెంటయ్యలు మంగళవారం నేషనల్ యూనియన్ ఫర్ మైగ్రేట్ వర్కర్స్ సెక్రటరీ గుర్రాల సలీంతో కలసి ఢిల్లీలోని ఎన్‌హెచ్‌ఆర్‌సీ అధికారులను కలసి వినతిపత్రం అందజేశారు. 40 మంది కార్మికులతో వనపర్తి-విజ్జపల్లి రోడ్డు, బ్రిడ్జి వర్క్ చేయించుకున్న కాంట్రాక్టర్ వేతనాలు ఇవ్వకుండా రెండేళ్లుగా ఇబ్బందులకు గురిచేస్తున్నటు వారు ఆరోపించారు.

పరుషవేదీశ్వర ఆలయం హుండీ లెక్కింపు



జడ్చర్ల టౌన్: మండలంలోని మీనాంబరం పరుషవేదీశ్వర ఆలయంలో మంగళవారం హుండీ లెక్కింపు చేపట్టగా రూ.5,13,359ల ఆదాయం వచ్చినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోపాల్ తెలిపారు. దేవాదాయ శాఖ అధికారిణి వీణాధరి కమిటీ సభ్యుల సమక్షంలో హుండీ లెక్కింపు చేపట్టారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని నిర్వహించిన బ్రహ్మోత్సవాలు ముగియడంతో హుండీ లెక్కించినట్లు వారు చెప్పారు.

మహిళా అభ్యున్నతి దేశప్రగతికి మార్గం


ఐక్యతచిహ్నం ప్రదర్శిస్తున్న మహిళలు

వర్క్‌షాప్‌లో అభిప్రాయాలు వెల్లడి

జడ్చర్ల టౌన్: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడమే దేశ ప్రగతికి దారితీస్తుందని డా.బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల మహిళా సాధికారత విభాగం కన్వీనర్, అధ్యాపకురాలు డా.సుభాషిణి, మహబూబ్‌నగర్ సుశృత ఆస్పత్రి ఎండీ డా. ప్రతిభలు అన్నారు. మంగళవారం కళాశాల సమావేశ మందిరంలో మహిళా సాధికారత విభాగంలో ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలపై పెట్టుబడి అవసరమని నిర్ణయించారు. అన్ని రంగాల్లో మహిళలు ఇప్పటికే ముందంజలో ఉన్నారని, కళాశాల విద్యార్థులు బాగా చదివి స్థిరపడాలని పిలుపునిచ్చారు. సమిష్టిశక్తిగా ఎదగాలని, అవరోధాలను అవకాశాలుగా మలుచుకునే శక్తి మహిళలకు అధికంగా ఉంటుందన్నారు. నెలసరి సమస్యలు, నివారణోపాయాలు, సమతుల్యాహారం, బ్రెస్ట్, సర్వికల్ కాన్సర్ వంటి వాటిపై అవగాహన కల్పించారు. సభాధ్యక్షులు వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఇప్పటికే మహిళలు రాణించని రంగం ఏది లేదని, దేశ ప్రగతిలోనూ మహిళలది కీలకపాత్ర ఉందన్నారు. పాలమూరు విశ్వవిద్యాలయం ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ డా.ప్రవీణ మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా విద్యార్థులలో సమన్వయశక్తి పెరుగుతుందన్నారు. వర్క్‌షాప్‌లో బ్యూటీషియన్ యశస్విని, శ్రీదేవి, తమ జీవితానుభవలాను పంచుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వర్క్‌షాప్‌లో మహిళాసాధికారత విభాగ సభ్యులు నీరజ, మంజుల, రమాదేవి, లత, రజిని, శ్రావణి, అనిత, భార్గవి, బాలరాజు, విఠల్, మల్లికార్జున్‌లు పాల్గొన్నారు.

'భారత్‌మాల' బాధితుల ఆందోళన


కాంట్రాక్టర్ ప్రతినిధితో వాగ్వాదం చేస్తున్న రైతులు

అయిజ: మండలంలోని దేవబండ శివారులో మంగళవారం భారతమాల రహదారిపై రైతులు ధర్నా చేపట్టారు. మట్టి తరలిస్తున్న టిప్పర్లను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ.. రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన తమకు రెండోవిడత నష్ట పరిహారం నేటికీ అందలేదని.. మూడేళ్లుగా కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ముఖ్యంగా బోరుబావులు, పైప్‌లైన్, చెట్లకు సంబంధించిన బిల్లులు చెల్లించాల్సి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు రూ.4.20 లక్షలు మాత్రమే చెల్లించారని.. మిగిలిన పరిహారం రెండోవిడతలో చెల్లిస్తామని అప్పటి కలెక్టర్ హామీ ఇచ్చారని, ముగ్గురు కలెక్టర్లు మారినా ఇంతవరకు పూర్తిస్థాయిలో అందలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ ప్రతినిధులు అక్కడకు చేరుకొని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఒకదశలో రైతులు, కాంట్రాక్టర్ ప్రతినిధులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. చివరకు చేసేదిలేక కాంట్రాక్టర్ ప్రతినిధులు వెనుదిరిగారు.

చోరీలతో కలకలం..


బూరెడ్డిపల్లి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం

ఆంజనేయస్వామి ఆలయంలో..

ధరూరు: మండలంలోని బూరెడ్డిపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయంలో దొంగతనం జరిగింది. వివరాలిలా ప్రకారం.. గ్రామంలో ఆలయంలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు స్వామి వారి నగలు వెండి తొడుగులు దాదాపు కిలో వెండినగలు ఎత్తుకెళ్లారు. గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మంగళవారం దయం డాగ్ స్క్వాడ్‌ను గ్రామంలోకి రప్పించి పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

అమరవాయి ఆలయంలో..

మల్దకల్: మండలంలోని అమరవాయి చింతలాముని నల్లారెడ్డి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలోకి చొరబడి స్వామివారి వెండి ఆభరణాలను దోచుకెళ్లారు. ఆలయంలో హుండీని ధ్వంసం చేసి, అందులోని సుమారు రూ.65 వేలను ఎత్తుకెళ్లారు. ఆలయ పూజారి ప్రభాకర్ ఉదయం ఆలయానికి వెళ్లగా తాళం పగల కొట్టిన విషయాన్ని గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించారు. ఆలయంలో 65వేల హుండీ డబ్బులు, 16 తులాల వెండీ ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు పూజారి తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్‌గౌడు తెలిపారు.

బొలెరో వాహనం చోరీ

గద్వాల క్రైం: బొలెరో వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన ఘటన మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. ప్రతాప్‌రెడ్డి టీఎస్ 32 టి 1666 నంబర్ గల బొలెరో గూడ్స్ వాహనాన్ని గద్వాల విద్యుత్‌శాఖలో కాంట్రాక్టు పద్ధతిన అద్దెకు ఉంచారు. కార్యాలయంలో నిలిపిన వాహనాన్ని ఎత్తుకెళ్లారని గద్వాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రైతు వేదికలో చోరీ

అయిజ: మండల కేంద్రంలో నిర్మించిన రైతు వేదికలో సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఎలక్ట్రానిక్ వస్తువులను అపహరించారు. మంగళవారం ఉదయం వ్యవసాయ అధికారులు రైతు వేదికలో విధులు నిర్వహించేందుకు వెళ్లగా తలుపులు పగులగొట్టి ఉండడం గమనించారు. లోపలికి వెళ్లి చూస్తే వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన బ్యాటరీ, ఎక్స్‌టెన్షన్ బాక్స్ తదితర వస్తువులను అపహరించినట్లు గుర్తించారు. వాటి విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందని మండల వ్యవసాయ అధికారి శంకర్‌లాల్ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి మంగళవారం వ్యవసాయ అధికారులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


విరిగిపోయిన తలుపు